సాక్షి జయశంకర్ భూపాలపల్లి

సోమవారం | 28 | ఏప్రిల్ | 2025



ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

పహల్గాంలో తీవ్రవాదుల కాల్పుల్లో పర్యాటకుల మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

- 9లో▸



వేసవి దుక్కులతో మేలు

యాసంగి పంటకోత అనంతరం భూమిని కలియ దున్నటం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

- 9లో▸

గరిష్టం/కనిష్టం
$36.7^0 / 26.9^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

గులాబీల జాతర!

తరలివచ్చిన జన ప్రవాహం..కిక్కిరిసిన సభా ప్రాంగణం



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలు చల్లుతున్న..



సభకు వెళ్తున్న వాహనాలు..



సభనుంచి తిరుగుపయనమైన వాహనాలు



ప్రసంగిస్తున్న కేసీఆర్, అభివాదం చేస్తున్న కేసీఆర్



ఎల్కతుర్తి క్రాస్ వద్ద జరిగిన రజతోత్సవ సభకు హాజరైన ప్రజలు, పార్టీ కార్యకర్తలు



అభివాదం చేస్తున్న కేటీఆర్

- గులాబీ వనంగా మారిన ఎల్కతుర్తి
- రోడ్లపైనే కిలోమీటర్ల మేర వాహనాలు
- ఆపరేషన్ కగార్‌ను ఆపాలి, నక్సల్స్‌తో చర్చించాలి..
- తీర్మానానికి సభ ఆమోదం
- అట్టహాసంగా బీఆర్ఎస్ రజతోత్సవ సభ
- శ్రేణుల్లో జోష్..చప్పట్లు, కేరింతల నడుమ సాగిన కేసీఆర్ ప్రసంగం

సాక్షిప్రతినిధి, వరంగల్:

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రజతోత్సవ సభ మినీ కుంభ మేళాను తలపించింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి ఎక్స్‌రోడ్‌లోని సభావేదికకు ఆదివారం మధ్యాహ్నంనుంచే వివిధ జిల్లాలకు చెందిన ప్రజలు, కార్యకర్తలు చేరుకోవడం మొదలైంది. సాయంత్రానికి ఇసుకేస్తే రాలనంతగా జనం తరలిరాగా, సభా ప్రాంగణమంతా చీమల దండును తలపించింది. సభా ప్రాంగణానికి దాదాపు నాలుగైదు కిలోమీటర్ల వరకు జనం బారులు దీరారు. ఇక సభా ప్రాంగణంలో కళాకారుల ఆటపాటలకు జనం ఉరకలేస్తూ.. ఉత్సాహంతో డ్యాన్సులు చేశారు. తెలంగాణ పాటలతో గులాబీ సైనికులు, ప్రజలు ఊగిపోయారు. గులాబీ జెండాలను రెపరెపలాడిస్తూ.. బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతూ ఉరకలెత్తిన ఉత్సాహంతో ఊగిపోయారు. కిక్కిరిసిన జనం, బాహుబలి వేదికపై కొలువుదీరిన నేతలు.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగం.. గులాబీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపింది.

తెలంగాణ ఉద్యమానికి ఓరుగల్లు తల్లి వంటిది

6.59 గంటలకు మైక్ అందుకున్న కేసీఆర్.. గ్యాదరి బాలమల్లును మైక్ సౌండ్ పెంచమంటూ ప్రసంగం మొదలుపెట్టారు.. 7:57 నిమిషాలకు ప్రసంగం ముగించారు. శ్రీ సీతారాముల జీవిత చరిత్రలో అయోధ్య ప్రాశస్త్యం మాదిరిగా తెలంగాణ సాధన ఉద్యమానికి ఓరుగల్లు కన్నతల్లి వంటిదని అభివర్ణిస్తూ ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఎగిరిన గులాబీ జెండా అంటూ.. ఈ జెండాను అనేక మంది ఎగతాళి చేసినా.. ఎట్టకేలకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ పేర్కొన్నారు. 25 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో నిర్వహించుకున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రత్యేకత ఉందని.. 1969లో మూగబోయిన తెలంగాణ ఉద్యమానికి రాణి రుద్రమదేవి, సమ్మక్క,సారలమ్మ స్ఫూర్తితో గులాబీ జెండా ఊపిరిలూదిందని.. ఓరుగల్లు ప్రాశస్త్యం, ఉద్యమంలో ఓరుగల్లుతో తనకున్న అనుబంధాన్ని వివరించారు.

బీఆర్ఎస్ పాలనను గుర్తు చేసిన కేసీఆర్

కాంగ్రెస్ వచ్చి ఏడాదిన్నరయ్యింది.. ఏం చెప్పింద్రు.. ఏం ఇస్తుంద్రు అనగానే ఏం ఇవ్వట్లేదు అని జనం పలికారు. ఇంతలో సభా వేదికకు దగ్గరగా ఉన్న పార్టీ శ్రేణుల గోలపై సహనం కోల్పోయిన కేసీఆర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పిలిచి 'రాజేశ్వర్ వీళ్లెవరయ్యా.. మనోళ్ల వేరే వాళ్ల జర చూడు' అన్నారు. అనంతరం కాంగ్రెస్ పరిపాలనను దుయ్యబట్టారు. ఇక కాంగ్రెస్ హామీల అమలు బుట్టదాఖలు తీరుపై జనం నోట పలికిస్తూ జోష్ తెచ్చారు. తెలంగాణ ప్రాంత దేవుళ్ల మీద ఒట్టు వేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఉనికి కోసం బీఆర్ఎస్‌పై అర్థరహిత విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. 'కేసీఆర్ పాలనకు.. కాంగ్రెస్ పాలనను పోల్చుకుని చూడండీ.. మీరేమో వాళ్లకు కత్తిచ్చి.. నన్ను యుద్ధం చేయిమంటున్నారు' అని చమత్కరించారు.

వైఎస్సార్ పాలనను..

ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ శాశ్వత ప్రజాసంక్షేమం కోసమని భావించి నిర్విరామంగా కొనసాగించామని కితాబిచ్చారు.

సభకు భూములిచ్చిన రైతులకు కృతజ్ఞతలు

రజతోత్సవ సభను ఇంత భారీగా నిర్వహించడానికి కృషి చేసిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దాస్యం వినయభాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్ రావులకు కేసీఆర్ అభినందనలు తెలిపారు. అలాగే సభకు స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



సభా హైలెట్స్

- సాయంత్రం 4:00 గంటలకు సభావేదికపై సాంస్కృతిక కళాకారుల ప్రదర్శనలు షురూ అయ్యాయి.
- 4:30 గంటలకు బీఆర్ఎస్ నేతలు టి.హరీశ్ రావు, మల్లారెడ్డి వేదికపైకి చేరుకున్నారు. 'పోరు తెలంగాణమా.. కోట్లాది ప్రాణమా' పాటకు మల్లారెడ్డి స్టెప్పులు వేశారు.
- 4:47 గంటలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, 5:18 గంటలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వేదికపైకి చేరుకున్నారు.
- 6:52 నిమిషాలకు కేసీఆర్‌కు గులాబీ దండు ఘనస్వాగతం పలికింది. ఆయన తొలుత వేదికపై ఏర్పాటు చేసిన అమరుల స్మారకస్తూపానికి పూలు చల్లి ఘననివాళి అర్పించారు.
- ఉచితంగా పంచిన గులాబీ జెండాలను తీసుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోటీపడ్డారు.
- బీఆర్ఎస్ 25 వసంతాల సెల్ఫీ పాయింట్ల వద్ద ప్రజలు సెల్‌ఫోన్లతో ఫొటోలు దిగుతూ సందడి చేశారు.
- ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తోపాటు కళాకారులు సారిక, జాను స్టెప్పులు అలరించాయి.
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తోపాటు గాయకులు సందీప్, సంధ్య పాడిన పాటలు సభికులను ఓలలాడించాయి.
- కేసీఆర్ వేషధారణతో టోపీ పెట్టుకొని వచ్చిన ఓ వ్యక్తి ప్రజలకు అభివాదం చేస్తూ జోష్ నింపాడు. - సాక్షి, వరంగల్

మరిన్ని సభా విశేషాలు

- 8లో▸



పహల్గాం మృతులకు సంతాపంగా మౌనం పాటిస్తున్న కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, బండా ప్రకాశ్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్‌రెడ్డి తదితరులు

మృతులకు నివాళి అర్పించి..

మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు సైతం సభపై ఆసీనులయ్యారు. కశ్మీర్‌లో ఉగ్రవాదులు అమాయక దేశ బిడ్డలను దారుణంగా బలి తీసుకున్నారని.. ఇందుకు మౌనం పాటిద్దామని కేసీఆర్ పిలుపునివ్వడంతో సభకు వచ్చిన వారంతా నిలబడి నిమిషంపాటు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును స్వాగతోపన్యాసం చేయాలని కోరారు. రజతోత్సవ సభకు హాజరైన బీఆర్ఎస్ రథసారథి కేసీఆర్‌కు స్వాగతం పలుకుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రసంగించారు. 2013 తర్వాత జరుగుతున్న భారీ సభకు విచ్చేసిన మాజీ మంత్రులు, బీఆర్ఎస్ అధినేతలు, తెలంగాణ నలుమూలల నుంచి వచ్చిన జనానికి కూడా ఆయన స్వాగతం చెప్పారు.

కట్టిపడేసిన ఆటాపాట..



మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సాధన ఉద్యమానికి ఊపిరిలూదిన ఆట, పాటలతో సుమారు మూడు గంటల పాటు ఆటపాటలతో సభికులను కట్టిపడేశారు. పాత పాటలతో పాటు కొత్తగా కేసీఆర్ పాలన, పునఃపరిపాలనకు దోహదం చేసే తీరుపై పలువురు గాయకులు ఆలోచింపజేస్తూ జోష్ నింపారు. ఈసందర్భంగా దివంగత గాయకుడు సాయిచంద్‌కు కళాకారులు ఆటపాటతో ఘన నివాళులు అర్పించారు. విభిన్న సాంస్కతిక కళాకారులు తమ ప్రతిభతో తెలంగాణ ఉద్యమ తీరును చాటారు. కేసీఆర్ సభాస్థలికి వచ్చే ముందు తెలంగాణ సాధన మలి ఉద్యమంలో కేసీఆర్ పాత్ర తీరుతెన్నులు, సాధించిన తెలంగాణ పురోగతిపై బహుబలి సినిమా తరహాలో డిజిటల్ స్క్రీన్లపై ప్రదర్శన ఇచ్చారు. సభకు వచ్చిన జనం నిశ్శబ్దంగా తిలకించడం గమనార్హం. ''మందెంట పోతుండే ఎలమంద... వాడు ఎవ్వాని కొడుకమ్మ ఎలమందా'' పాటకు సభికులు ఉర్రూతలూగారు. ''సారే కావాలంటున్నరే... తెలంగాణ పల్లెలల్ల.. మల్ల కారే రావాలంటున్నరే తెలంగాణ జిల్లలల్ల'' తదితర పాటలతో సభాప్రాంగణం దద్దరిల్లింది. సభలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్, జి.జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, డా.బండా ప్రకాష్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, కల్వకుంట్ల కవిత, తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, డా.టి.రాజయ్య, ధరంసోతు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, బాల్క సుమన్, గాదరి కిశోర్, చల్లా ధర్మారెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎంపీ మాలోతు కవిత తోపాటు పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు పాల్గొన్నారు.



సభాస్థలికి చేరుకుంటున్న కార్యకర్తలు..



వాహనాలతో నిండిన పార్కింగ్ స్థలాలు..

పూర్వ వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, నల్లగొండ తదితర జిల్లాల నుంచి వాహనాల ద్వారా వేలాదిగా తరలివచ్చారు. చింతలపల్లిలో సుమారు 1,059 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలు వాహనాలతో నిండిపోయాయి. పోలీసులతో పాటు 2,500 మంది వలంటీర్లు ట్రాఫిక్ నియంత్రణలో నిమగ్నమైనా.. వందలాది వాహనాలు రోడ్లపైనే నిలిచిపోయాయి.

ముమ్మరంగా నిర్మాణం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15నుంచి 26వరకు జరుగు సరస్వతినది పుష్కరాల కోసం (వీఐపీ) జ్ఞాన సరస్వతి ఘాట్ వద్ద సరస్వతి మాత విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి బేస్‌స్టాండ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రూ.కోటితో సరస్వతిమాత విగ్రహం, చుట్టూర నలుగురు వేదమూర్తుల విగ్రహాలు, లాన్ నిర్మించనున్నారు. సరస్వతిమాత విగ్రహం తమిళనాడులోని మహాబలిపురంలో తుది మెరుగులు దిద్దుకున్నట్లు ఆలయవర్గాలు పేర్కొంటున్నాయి. మే మొదటివారంలో విగ్రహాన్ని హైడ్రాలిక్‌తో స్టాండ్ బేస్‌పై ఎరక్షన్ చేయడానికి ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.



విగ్రహం కోసం నిర్మాణం చేస్తున్న బేస్‌స్టాండ్



రోడ్డు మధ్యలో 'బోరు'

నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్న చందంగా మారింది పంచాయతీరాజ్ అధికారులు, కాంట్రాక్టర్ల వ్యవహారం. మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15నుంచి 26వరకు జరుగు సరస్వతి నది పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరుచేసి పనులు ప్రారంభించింది. త్రివేణి సంగమం వద్ద సరస్వతి ఘాట్ రోడ్డులో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు మధ్యలో బోరును అలాగే వదిలేశారు. రోడ్డు మధ్యలో అడ్డుగా ఉన్న బోరును చూసినవారంతా నవ్వుకుంటున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో రోడ్డు మధ్యలో బోరును వదిలేశారని విమర్శలు గుప్పిస్తున్నారు. - కాళేశ్వరం

మే 5న అర్చక పోస్టులకు పరీక్ష

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో ఖాళీగా ఉన్న ఐదు అర్చక పోస్టులకు మే 5న రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నారు. ఇటీవల దేవాదాయశాఖ ఐదు అర్చక పోస్టుల కోసం నోటిఫికేషన్ వేసి దరఖాస్తులు ఆహ్వానించారు. మొత్తం 41మంది దరఖాస్తులు ఈఓ కార్యాలయంలో సమర్పించారు. మే 5న హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో పరీక్ష నిర్వహించనున్నారు. మే 15నుంచి జరుగు సరస్వతి పుష్కరాల వరకు అర్చకుల నియామకం చేయడానికి దేవాదాయశాఖ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

అకాల వర్షం



కాటారం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున అకాల వర్షం కురిసింది. వర్షంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. గ్రామాల్లో రైతులు కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం కొంత మేర తడిసింది. రాత్రిపూట ధాన్యం కుప్పలపై పరదాలు కప్పి తడవకుండా రక్షించుకోవడానికి నానా పాట్లు పడ్డారు. వర్షాభావ సూచనలతో రైతులు అప్రమత్తమయ్యారు.

నిరుద్యోగ సమస్యను రూపుమాపుతాం

- ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి అర్బన్/భూపాలపల్లి రూరల్: నిరుద్యోగ సమస్యను రూపు మాపుతామని, నిరుద్యోగులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం కృషితో ఎదగాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. జిల్లాకేంద్రంలోని పుష్ప గ్రాండ్‌లో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున నిరుద్యోగులు హాజరయ్యారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి ప్రారంభించారు. జాతీయ, రాష్ట్రస్థాయిలోని సుమారు 75 కంపెనీల నిర్వాహకులు పాల్గొనగా 12వేల మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన 280మంది అభ్యర్థులకు ఎమ్మెల్యే, కలెక్టర్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలోనూ ఉద్యోగావకాశాలను కల్పించేందుకు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువత ఉపాధి కోసం ఇతర జిల్లాలకు సైతం వెళ్లాలని సూచించారు. కలెక్టర్ పంజాబ్ నుంచి, ఎస్పీ మహారాష్ట్ర నుంచి వచ్చి మన జిల్లాలో ఉద్యోగం చేస్తున్నారని, యువత ఉన్న చోటనే ఉద్యోగం చేయాలన్న లక్ష్యాన్ని విడనాడాలని స్పష్టంచేశారు. జిల్లాలో సింగరేణి ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్యం సాధించడానికి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు లేక మద్యం, మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి కల్పన వల్ల జీవనోపాధి లభిస్తుందని చెప్పారు. యువత ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకునేందుకు నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రభుత్వం హైదరాబాద్‌లో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందన్నారు. స్కిల్ యూనివర్సిటీ దేశంలో మరెక్కడా లేదని తెలిపారు.



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర, పక్కన కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే



మెగా జాబ్‌మేళాకు భారీ సంఖ్యలో హాజరైన నిరుద్యోగులు



ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు

కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ జిల్లాలో 10వేల మందికి పైగా నిరుద్యోగులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్నారని, గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలు వేసి యువతకు సమాచారాన్ని చేరవేసినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


ప్రధాన రహదారిపైకి వస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజలను అడ్డుకుంటున్న పోలీసులు


ఉత్సాహంగా అభివాదం చేస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డి


సభకు హాజరైన వారికి మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న వలంటీర్లు

రజతోత్సాహం

కదంతొక్కిన గులాబీ శ్రేణులు

● ఎల్కతుర్తి సభకు లక్షలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

బీఆర్‌ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి సమీపంలో ఆదివారం రజతోత్సవ సభను నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు లక్షలాదిగా తరలివచ్చాయి. దీంతో ఎల్కతుర్తి గులాబీమయంగా మారింది. వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ కార్యకర్తలు పాదయాత్రగా సభకు చేరుకున్నారు. ఎడ్ల బండ్లు, కార్లు, బస్సుల్లో శ్రేణులు ఉత్సాహంగా రజతోత్సవ సభకు తరలివచ్చారు. సభకు తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులకు పార్టీ ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించారు.


వేదికపైకి వస్తూ పార్టీ నాయకులకు అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్



రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలను తీసుకొచ్చిన బస్సులు, కార్లు



భారీ బ్యానర్‌తో పాదయాత్రగా వస్తున్న సిద్దిపేట బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం విద్యార్థులు, యువకులు


సభా ప్రాంగణం సమీపంలో ట్రాఫిక్ జామ్


సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ కటౌట్


హెలికాప్టర్ దిగుతూ అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్


సభా ప్రాంగణానికి నడుచుకుంటూ వస్తున్న కార్యకర్తలు


సభకు వస్తున్న మహిళా వలంటీర్లు


రజతోత్సవ సభకు వస్తున్న మహిళలు


కొమ్మలు లేని చెట్టుపైకి ఎక్కి సభను వీక్షిస్తున్న యువకులు



హెలికాప్టర్‌లో సభా వేదిక వద్దకు వస్తున్న కేసీఆర్‌ను చూస్తున్న ప్రజలు



సభా వేదికపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, తదితరులు


పాట పాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


సభలో యువత ఉత్సాహం

సభలో అవి ఇవి

అంబులెన్స్‌కు తప్పని అవస్థలు



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వందల సంఖ్యలో వాహనాలు రావడంతో ఎల్కతుర్తి నుంచి హనుమకొండకు వెళ్తున్న అంబులెన్స్‌కు అవస్థలు తప్పలేదు. సుమారు కిలోమీటర్ మేర నిలిచిన వాహనాలతో అంబులెన్స్ ట్రాఫిక్‌లో అతికష్టం మీద బయటపడింది.

వినూత్న ప్రచారం



హన్మకొండ చౌరస్తా: సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన మనోహర్ అనే వ్యక్తి మాజీ సీఎం కేసీఆర్‌పై తనకున్న అభిమానాన్ని వినూత్నంగా చాటుకున్నారు. సూర్య భగవాన్ వేషధారణలో కేసీఆర్ ఫ్లెక్సీపై కేసీఆర్ మలిదశ ఉద్యమ ప్రస్థానం, ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలను సభాస్థలి పరిసర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. చేతిలో మైకు, ఒంటికి కేసీఆర్ ఫ్లెక్సీతో పార్టీ కార్యకర్తల అభిమానాన్ని చూరగొన్నారు.

మాజీ ఎమ్మెల్సీని అడ్డుకున్న పోలీసులు



ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు, కార్యకర్తలు లక్షలాదిగా తరలివచ్చారు. అయితే సభకు హాజరయ్యేందుకు వస్తున్న మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డిని వీవీఐపీ పాస్ లేదనే కారణంతో పోలీసులు ఎల్కతుర్తి సెంటర్ వద్ద అడ్డుకున్నారు.

హోటళ్లకు ఫుల్ గిరాకీ

జనగామ: బీఆర్‌ఎస్ ఎల్కతుర్తి రజతోత్సవ సభతో హోటళ్లు, టీ సెంటర్లకు గిరాకీ ఒక్కసారిగా పెరిగింది. వరంగల్–హైదరాబాద్ నేషనల్ హైవేపై 11 జిల్లాలకు చెందిన గులాబీ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలు జనగామ మీదుగా వెళ్లారు. దీంతో ఈ దారిలో ఉన్న టిఫిన్ సెంటర్లు, భోజనం హోటళ్లు, టీ స్టాల్స్ వ్యాపారం జోరుగా సాగింది. ఎల్కతుర్తి సభకు 300 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న జిల్లాల నుంచి వచ్చే ప్రజలు టిఫిన్ చేస్తూ.. టీ తాగుతూ రిలాక్స్ అయ్యారు. కొంతమంది వెంట తెచ్చుకున్న భోజనాన్ని దారిలోనే భుజించారు. చాయ్‌కి సైతం పది నుంచి పదిహేను నిమిషాల పాటు ఆగాల్సిన పరిస్థితి. జనగామ పెంబర్తి నుంచి చిన్న పెండ్యాల వరకు ఎక్కడ చూసినా హోటల్స్ వద్ద వందలాది మంది కనిపించారు.


టీ స్టాల్ వద్ద గులాబీ శ్రేణులు, అభిమానులు

బాటిళ్లు విసరడంతో మహిళకు గాయాలు


మిట్టపల్లి సులోచనను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

హన్మకొండ: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభలో ముందున్న కార్యకర్తలు నిలబడడంతో వెనుక ఉన్న కార్యకర్తలకు వేదిక కనపడడం లేదనే అసహనంతో వాటర్ బాటిళ్లు విసిరారు. దీంతో ఎల్కతుర్తి సమీపంలోని ఇందిరానగర్‌కు చెందిన మిట్టపల్లి సులోచన గాయపడింది. స్పృహ కోల్పోయి పడిపోవడంతో గమనించిన మహిళా పోలీసులు ఆమె ముఖంపై నీళ్లు చల్లి, వాటర్ తాగించారు. దీంతో ఆమె స్పృహలోకి వచ్చారు. అనంతరం ఆమెను ఆస్పత్రికి తరలించారు.

ఇవి మాకే..!



హన్మకొండ: రజతోత్సవ సభకు వచ్చే కార్యకర్తల దాహార్తి తీర్చేందుకు బీఆర్‌ఎస్ పార్టీ పెద్ద ఎత్తున వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచింది. అయితే ఆదివారం ఉష్ణోగ్రత తక్కువగా ఉండడంతో వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు మిగిలిపోయాయి. దీంతో ఇక ఇవి మాకే అన్నట్లుగా సభకు వచ్చిన కార్యకర్తలు వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు, ఐస్ వేసి ఉంచిన డ్రమ్ములను భుజాలపై మోసుకెళ్లడం గమనార్హం.

చల్లబడ్డ వాతావరణం.. ఊపిరి పీల్చుకున్న శ్రేణులు..

కొన్నిరోజులుగా విపరీతమైన ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సుమారు 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ప్రతీరోజు ఉదయం 9గంటల నుంచే మండిపడిన సూరీడు.. ఆదివారం కాస్త చల్లబడ్డాడు. ఉదయం వాతావరణం సాధారణంగా ఉండగా.. మధ్యాహ్నం కాస్త ఎండ కన్పించింది. సాయంత్రం పూర్తిగా చల్లబడింది. గరిష్ట ఉష్ణోగ్రతలు 34 నుంచి 36 డిగ్రీల వరకు నమోదైనట్లు తెలుస్తోంది. దీంతో మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్, సిద్దిపేట, హైదరాబాద్‌లాంటి దూరప్రాంతాలనుంచి సభకు వచ్చే ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు హమ్మయ్య అనుకుంటూ సభాప్రాంగణానికి బయల్దేరి వెళ్లారు. కేసీఆర్ సభకు సూర్యుడు కూడా సహకరించారని చెప్పుకోవడం గమనార్హం.

వైన్ షాపులు కిటకిట



బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా మందుబాబుల జోష్ కనిపించింది. ఎల్కతుర్తి సభ ప్రాంగణానికి వెళ్లే క్రమంలో దారుల వెంట ఉన్న వైన్స్‌లో మద్యాన్ని కొనుగోలు చేశారు. దీంతో ఆయా షాపుల్లో మద్యం కోసం జనం క్యూకట్టారు. పలువురు వాహనాల్లోనే మద్యం సేవించడం కనిపించింది.

ఆటంకం కలిగిస్తే ఊరుకోం..

● మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పల్లా హెచ్చరిక

సాక్షిప్రతినిధి, వరంగల్: మామునూరు, వర్ధన్నపేట, జనగామ నుంచి వచ్చే వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తూ జనం సభావేదికకు రాకుండా ఆటంకాలు కలిగిస్తున్నారని.. అధికారులు, పోలీసులు సహకరించాలని సభావేదికపై నుంచి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పదేపదే విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సాధన కోసం పుట్టిన పార్టీ ఇరవై ఐదు ఏళ్ల ఉత్సవాలకు ఎవరూ ఆటంకం కలిగించినా ఊరుకునేదిలేదని.. జనాన్ని ఆపితే కాంగ్రెస్ వాళ్లను ఉరికిచ్చి కొడతామని దయాకర్‌రావు హెచ్చరించారు. పదిహేను కిలోమీటర్ల మేర వాహనాలు స్తంభించినా పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేయకపోవడం విచాకరమని, మీపై మా పార్టీకి మర్యాద ఉందని, మా సహనాన్ని పరీక్షించొద్దని పలు సార్లు దయాకర్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి సూచించారు.

జనసందోహమే..


హసన్‌పర్తి: ఎల్కతుర్తి సెంటర్‌లో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

● గులాబీమయంగా మారిన ఎల్కతుర్తి

ఎల్కతుర్తి: బీఆర్‌ఎస్ బహిరంగ సభకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలనుంచి ప్రజలు భారీగా తరలిరావడంతో ఎల్కతుర్తి కిటకిటలాడింది. ఎక్కడ చూసినా జనసందోహమే కనిపించింది. మధ్యాహ్నం వరకు వివిధ ప్రాంతాలనుంచి ప్రజలు భారీగా చేరుకున్నారు. సభా ప్రాంగణానికి కేవలం 400 మీటర్ల దూరంలో ఉన్న హోటళ్లు, కిరాణం షాపుల్లో జనం రద్దీ భారీగా కనిపించింది. సాయంత్రం 5 గంటల వరకు సభా ప్రాంగణం ప్రజలతో నిండిపోయింది. ఎండాకాలం కావడంతో వలంటీర్లు ప్రజలకు వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందించారు. రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో కళాకారులు ఆడిపాడిన పాటలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం 7గంటలకు కేసీఆర్ సభా వేదికపైకి చేరుకోగానే ప్రజలు జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. వేదికపై ఉన్న తెలంగాణ విగ్రహానికి పూలమాల వేసి వందనం సమర్పించారు. అనంతరం సభికులకు కేసీఆర్ అభివాదం చేస్తుండడంతో సీఎం..సీఎం అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. వాతావరణం చల్లాగా ఉండడంతో సభా పూర్తయ్యేవరకు కేసీఆర్ ప్రసంగాన్ని విన్నా రు. ఏదిఏమైనా లక్షలాది మంది ఎల్కతుర్తికి తరలిరావడంతో పూర్తిగా గులాబీమయంగా మారింది.

గులాబీ వాహనాల జాతర



జనగామ: వరంగల్–హైదరాబాద్ నేషనల్ హైవే జనగామ జిల్లా సరిహద్దులో వాహనాల జాతర

హైవేపై సెకనుకు 50కి పైగానే..

● అడుగడుగునా పోలీసు నిఘా

● రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన జనం

జనగామ: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు గులాబీ దళం ఉద్యమ కెరటం కదిలింది. నాగర్‌కర్నూల్ నుంచి జనగామ వరకు వేలాది వాహనాలు వరంగల్–హైదరాబాద్ నేషనల్ హైవేపై కదులుతుంటే చీమల దండును తలపించింది. సెకనుకు 50 వాహనాల చొప్పున.. రోడ్డుపై గ్యాప్ లేకుండా రయ్ రయ్ మంటూ పరుగెత్తాయి. డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట ఏసీపీల పర్యవేక్షణలో సీఐ, ఎస్సై, పోలీసు బలగాలు పెద్ద ఎత్తున బందోబస్తు చర్యలు చేపట్టాయి. నాగర్‌కర్నూల్, వనపర్తి, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట, జనగామ జిల్లాలతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి ఎల్కతుర్తి బహిరంగ సభకు వెళ్లాయి. రఘునాథపల్లి మండలం కోమళ్ల, దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి టోల్‌గేట్ల వద్ద ఎలాంటి రుసుం తీసుకోకుండా గేట్లను తెరిచి ఉంచారు. దీంతో కొంత మేర ట్రాఫిక్‌ను నియంత్రించగలిగారు. సభ ముగిసిన తర్వాత అర్ధరాత్రి వరకు హైవేపై వాహనాల రద్దీ కొనసాగింది. పోలీసులు, నిఘా వర్గాలు తెల్లవారు జాము వరకు నేషనల్ హైవేపై బందోబస్తు చర్యలు చేపట్టారు.